



# మనం





## నిజామాబాద్
## కామారెడ్డి

ఆదివారం । 20 । సెప్టెంబర్ । 2026 పేజీలు: 13


# ఫీజులు ముఖ్యమా..
# విద్యార్థి జీవితం ముఖ్యమా ?




- మొదటి టర్మ్ ఫీజు చెల్లించలేదని హాస్టల్లోకి అనుమతించని యాజమాన్యం.
- మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తండ్రి వేడుకోలు.
- నెల గడువు ఇవ్వండి అని కోరినా అంగీకరించలేదని ఆవేదన.
- జర్నలిస్ట్ అని చెప్పిన కూడా చులకనగా మాట్లాడిన వైనం.
- అవమానంతో వెనుదిరిగిన తండ్రి.
- జర్నలిస్టు కుటుంబానికే ఇలా జరిగితే.. సామాన్య విద్యార్థుల పరిస్థితి ఏంటని ప్రశ్న.
- డిపాజిట్ 5000 రూపాయలు అంట.... దేనికి డిపాజిట్...?
- ఇదేనా ఆర్టీఈ 2009 యాక్ట్ చెబుతుంది...?
- సమస్యపై నిజామాబాద్ జిల్లా కలెక్టర్ను కలవనున్న బాధితుడు.

3

నిజామాబాద్, సెప్టెంబర్ 19 (మనం బ్యూరో): ఫీజులు ముఖ్యమా..? విద్యార్థి జీవితం ముఖ్యమా..? అనే ప్రశ్నలు నిజామాబాద్ జిల్లా బోధన్ సమీపంలోని ఆచన్ పల్లి వద్ద ఆటోనగర్లో ఉన్న ప్రజ్ఞ రెసిడెన్షియల్ (హాస్టల్) పాఠశాల యాజమాన్యంపై తలెత్తుతున్నాయి. మొదటి టర్మ్ ఫీజు రూ.25 వేలు చెల్లించలేదనే కారణంతో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని హాస్టల్లోకి అనుమతించలేదు. ప్రస్తుతం తన వద్ద ఫీజు చెల్లించేంత మొత్తం లేదని, ఒక నెల గడువు ఇస్తే తప్పకుండా చెల్లిస్తానని కోరినా యాజమాన్యం అంగీకరించలేదు. ఐదు గంటలుగా బ్రతిమిలాడినా ప్రయోజనం లేకపోవడంతో అవమానంతో, మనోవేదనతో తన కొడుకుతో ఆ తండ్రి వెనుదిరిగాడు.

## ముత్యంపేట ఆరోగ్య మందిర్
# కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



- వైద్య సేవలతోపాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి, రోగులతో మర్యాదగా వ్యవహరించాలి.
- అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.

2

## రెడ్ క్రాస్ ఎన్నికలకు
# నోటిఫికేషన్ విడుదల

ఎస్.వై. గిరి

2



- 24న నామినేషన్ల స్వీకరణ, 25న పరిశీలన, 26న ఉపసంహరణ, తుది జాబితా ప్రకటన.
- అక్టోబరు 4న పోలింగ్, అదే రోజు ఫలితాల వెల్లడి.

# చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి



- రామడుగు ప్రాజెక్టు నుంచి 120 క్యూసెక్కుల నీటి విడుదల.
- రైతులు పొదుపుగా వినియోగించుకోవాలి.
- ఎమ్మెల్యే భూపతి రెడ్డి

2

*నిజామాబాద్ రూరల్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): రైతుల విజ్ఞప్తి మేరకు ధర్పల్లి మండలంలోని రామడుగు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల నుంచి శనివారం సాగునీటిని విడుదల చేసినట్లు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి తెలిపారు.*

# చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి

- రామడుగు ప్రాజెక్టు నుంచి 120 క్యూసెక్కుల నీటి విడుదల.
- రైతులు పొదుపుగా వినియోగించుకోవాలి.
- ఎమ్మెల్యే భూపతి రెడ్డి





నిజామాబాద్ రూరల్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): రైతుల విజ్ఞప్తి మేరకు ధర్పల్లి మండలంలోని రామడుగు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల నుంచి శనివారం సాగునీటిని విడుదల చేసినట్లు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కుడి కాలువకు 90 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 30 క్యూసెక్కులు.. మొత్తం 120 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ నీటితో సుమారు 6,100 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనున్నట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల్లోకి కొంతమేర నీరు చేరిందని, జిల్లాలో వరి సాగు విస్తీర్ణం అధికంగా ఉన్నందున రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. సాగునీటి విడుదలపై కొన్ని ఆంక్షలు ఉన్నప్పటికీ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డితో కలిసి రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో చర్చించి రామడుగు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసేందుకు అనుమతులు పొందినట్లు భూపతి రెడ్డి తెలిపారు. నీటిని మూడు దశల్లో విడుదల చేయనున్నందున చివరి ఆయకట్టు వరకు సాగునీరు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులు కాలువలకు గండ్లు కొట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అధికారులు కాలువల్లో లీకేజీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నివారించాలని ఆదేశించారు.

భవిష్యత్లో కరువు పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున ప్రతి నీటి బొట్టును జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే అలీసాగర్, గుత్పా ప్రాజెక్టుల నుంచి కూడా సాగునీటిని విడుదల చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతుల పంటలను కాపాడటమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

**రైతులకు విద్యుత్ సరఫరాపై ప్రతిపక్షాలవి గాలిమాటలు**

గత ప్రభుత్వ హయాంలో రైతులకు విద్యుత్ సరఫరా అంతంతమాత్రంగానే ఉండేదని ఎమ్మెల్యే భూపతి రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పంటలను కాపాడేందుకు విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. విద్యుత్ సరఫరాపై ప్రతిపక్షాలు వాస్తవాలను పక్కనపెట్టి విమర్శలు చేస్తున్నాయని పేర్కొన్నారు.

**కరువును ప్రభుత్వానికి ఆపాదించడం సరికాదు.**





ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావ పరిస్థితుల కారణంగా ఏర్పడే కరువును కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆపాదించడం సరికాదని భూపతి రెడ్డి అన్నారు. రైతుల పంటలను కాపాడేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వాల నిర్ణయాలపై కూడా ఆయన విమర్శలు చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి గతంలో జరిగిన ప్రయత్నాలను ప్రస్తావిస్తూ, ప్రాజెక్టుల విషయంలో దీర్ఘకాలిక ప్రణాళిక అవసరమన్నారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు సంబంధించి గతంలో జరిగిన నిర్ణయాలపై ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కూడా సమీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారికంగా పేర్కొంది.

**బీఆర్ఎస్పై ఎమ్మెల్యే విమర్శలు.**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనపై కూడా ఎమ్మెల్యే భూపతి రెడ్డి విమర్శలు చేశారు. గత పదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా, రుణమాఫీ, పంటల బీమా, సన్నరకం ధాన్యానికి బోనస్, ఉచిత విద్యుత్ తదితర కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు అధికారికంగా వెల్లడించింది. అందుబాటులో ఉన్న సాగునీటిని రైతులు పొదుపుగా వినియోగించుకుని పంటలను కాపాడుకోవాలని ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాయిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నరేష్, కాంగ్రెస్ నాయకులు పొలసాని శ్రీనివాస్, బాలరాజు, మనోహర్ రెడ్డి, అమృతపూర్ గంగాధర్, అంబర్ సింగ్, సంజయ్ రెడ్డి, ఆనంద్, మహేందర్తో పాటు కార్యకర్తలు, ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# ముత్యంపేట ఆరోగ్య మందిర్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- వైద్య సేవలతోపాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి, రోగులతో మర్యాదగా వ్యవహరించాలి.
- అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.



కామారెడ్డి, సెప్టెంబర్ 18 (మనం జిల్లా ప్రతినిధి): దోమకొండ మండలం ముత్యంపేటలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో అందుతున్న వైద్య సేవలు, ఔషధాల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు సకాలంలో అందేలా సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఆసుపత్రి ప్రాంగణం, స్టోర్ రూమ్ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా నిల్వలను క్రమం తప్పకుండా పరిశీలించి, రోగులకు సకాలంలో పంపిణీ చేయాలని సూచించారు. ప్రతి రోగితో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, డీఎంహెచ్ఓ వెంకట్, స్థానిక వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల: ఎన్.వై. గిరి

- 24న నామినేషన్ల స్వీకరణ, 25న పరిశీలన, 26న ఉపసంహరణ, తుది జాబితా ప్రకటన.
- అక్టోబరు 4న పోలింగ్, అదే రోజు ఫలితాల వెల్లడి.



కామారెడ్డి, సెప్టెంబర్ 19 (మనం జిల్లా ప్రతినిధి): జిల్లా భారత రెడ్క్రాస్ సొసైటీ పాలకమండలిలోని 15 స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికలను రహస్య బ్యాలెట్ పద్ధతిలో పారదర్శకంగా నిర్వహిస్తామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు ఎన్.వై. గిరి తెలిపారు. ఎన్నికల అధికారి టి. ప్రశాంత్రెడ్డితో కలిసి నోటిఫికేషన్ విడుదల చేశారు. సెప్టెంబరు 24న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఐడీఓసీ కలెక్టరేట్లోని గది నంబరు 2లో నామినేషన్లు స్వీకరిస్తారు. 25న పరిశీలన, 26న మధ్యాహ్నం 1 గంట వరకు ఉపసంహరణకు అవకాశం. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత తుది అభ్యర్థుల జాబితా, గుర్తులు ప్రకటిస్తారు. అక్టోబరు 4న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జెడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు. అభ్యర్థులు క్రిమినల్ రికార్డు లేనివారై ఉండాలని, ఫారమ్-2తో పాటు రూ.10 వేల నాన్రిఫండబుల్ రుసుము చెల్లించాలని అధికారులు తెలిపారు. ఓటర్లు ఫొటో గుర్తింపు కార్డుతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9989487624లో సంప్రదించవచ్చు.

# ఫీజులు ముఖ్యమా..? విద్యార్థి జీవితం ముఖ్యమా..?

**- మొదటి టర్మ్ ఫీజు చెల్లించలేదని హాస్టల్లోకి అనుమతించని యాజమాన్యం.**

**- మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తండ్రి వేడుకోలు.**

**- నెల గడువు ఇవ్వండి అని కోరినా అంగీకరించలేదని ఆవేదన.**

**- జర్నలిస్ట్ అని చెప్పిన కూడా చులకనగా మాట్లాడిన వైనం.**


**- అవమానంతో వెనుదిరిగిన తండ్రి.**

**- జర్నలిస్టు కుటుంబానికే ఇలా జరిగితే.. సామాన్య విద్యార్థుల పరిస్థితి ఏంటని ప్రశ్న.**

**- డిపాజిట్ 5000 రూపాయలు అంట.... దేనికి డిపాజిట్...?**

**- ఇదేనా ఆర్టీఈ 2009 యాక్ట్ చెబుతుంది...?**

**- సమస్యపై నిజామాబాద్ జిల్లా కలెక్టర్ను కలవనున్న బాధితుడు.**







నిజామాబాద్, సెప్టెంబర్ 19 (మనం బ్యూరో): ఫీజులు ముఖ్యమా..? విద్యార్థి జీవితం ముఖ్యమా..? అనే ప్రశ్నలు నిజామాబాద్ జిల్లా బోధన్ సమీపంలోని ఆచన్ పల్లి వద్ద ఆటోనగర్లో ఉన్న ప్రజ్ఞ రెసిడెన్షియల్ (హాస్టల్) పాఠశాల యాజమాన్యంపై తలెత్తుతున్నాయి. మొదటి టర్మ్ ఫీజు రూ.25 వేలు చెల్లించలేదనే కారణంతో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని హాస్టల్లోకి అనుమతించలేదు. ప్రస్తుతం తన వద్ద ఫీజు చెల్లించేంత మొత్తం లేదని, ఒక నెల గడువు ఇస్తే తప్పకుండా చెల్లిస్తానని కోరినా యాజమాన్యం అంగీకరించలేదు. ఐదు గంటలుగా బ్రతిమిలాడినా ప్రయోజనం లేకపోవడంతో అవమానంతో, మనోవేదనతో తన కొడుకుతో ఆ తండ్రి వెనుదిరిగాడు.

## ఐదు గంటల పాటు వేడుకున్నా.. ఫలితం లేదని ఆవేదన.

బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం., శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో పాఠశాలకు వెళ్లి తన కుమారుడిని హాస్టల్లోకి అనుమతించాలని యాజమాన్యాన్ని కోరాడు. మొదటి టర్మ్ ఫీజుగా రూ.25 వేలు చెల్లించాల్సి ఉందని, అవి కడితేనేగాని అనుమతి లేదని అన్నారని తెలిపారు. ప్రస్తుతం ఆ మొత్తం తన వద్ద లేదని వివరించి, ఒక నెల గడువు ఇవ్వాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు.

మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు యాజమాన్యాన్ని పలుమార్లు వేడుకున్నప్పటికీ తన విజ్ఞప్తిని అంగీకరించలేదని, చివరకు తన కుమారుడిని హాస్టల్లోకి అనుమతించలేదని ఆయన ఆరోపించారు.

## జర్నలిస్టునని చెప్పినా.. సమస్య పరిష్కారం కాలేదు

తాను రెంజల్ మండల రిపోర్టర్గా జర్నలిజం వృత్తిలో ఉన్నానని, తన పరిస్థితిని అర్థం చేసుకుని కొంత సమయం ఇవ్వాలని కోరినప్పటికీ యాజమాన్యం నుంచి సానుకూల స్పందన రాలేదని బాధితుడు తెలిపారు.

తన వృత్తి గురించి చెప్పినప్పటికీ కూడా సమస్య పరిష్కారం కాలేదని, తన కుమారుడి చదువుకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరుతూ గంటల తరబడి వేడుకోవాల్సి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## ఫీజు బకాయి ఉంటే.. విద్యార్థి చదువుకు ఆటంకమేనా?.,

తల్లిదండ్రులకు ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడు ఫీజు చెల్లింపునకు కొంత గడువు ఇవ్వడం లేదా విడతల వారీగా చెల్లించే అవకాశం కల్పించడం వంటి మార్గాలను పరిశీలించవచ్చని బాధితుడు పేర్కొన్నారు. అయితే ఫీజు బకాయి ఉందనే కారణంతో విద్యార్థిని హాస్టల్లోకి అనుమతించకపోవడం వల్ల అతని చదువుకు అంతరాయం కలిగే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి భవిష్యత్తు, విద్యకు సంబంధించిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆర్టీఈ 2009 యాక్ట్ లో ఇదే ఉందా అని వాపోయాడు.

## జర్నలిస్టు పిల్లవాడికే ఇలా అయితే.. సామాన్యుల పరిస్థితి ఏంటి?

ఒక జర్నలిస్టు తన కుమారుడి చదువు కోసం ఐదు గంటల పాటు పాఠశాల యాజమాన్యాన్ని వేడుకోవాల్సిన పరిస్థితి వస్తే.. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్య తల్లిదండ్రులు, వారి పిల్లల పరిస్థితి ఎలా ఉంటుంది? అని బాధితుడు ప్రశ్నించారు.

ఫీజు చెల్లింపులో తాత్కాలిక ఇబ్బందులు ఎదుర్కొనే తల్లిదండ్రుల పరిస్థితిని అర్థం చేసుకుని, విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా సమస్యలను మానవీయ దృక్పథంతో పరిష్కరించాలని కోరారు.



## నిజామాబాద్ కలెక్టర్ను కలవనున్న బాధితుడు.

తన కుమారుడి చదువు కొనసాగించేలా తగిన పరిష్కారం చూపించాలని కోరుతూ సోమవారం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ను కలిసి సమస్యను వివరించనున్నట్లు బాధితుడు తెలిపారు. పాఠశాల యాజమాన్యం తన కుమారుడిని తిరిగి హాస్టల్లోకి అనుమతించేలా, విద్యకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరనున్నట్లు చెప్పారు.

## విద్యాశాఖ అధికారులు స్పందించాలి.

ఈ ఘటనపై విద్యాశాఖ అధికారులు స్పందించి వాస్తవాలను పరిశీలించాలని బాధితుడు కోరుతున్నారు. ఫీజు బకాయిల కారణంగా విద్యార్థిని హాస్టల్లోకి అనుమతించకుండా ఉండటానికి సంబంధించి ఏమైనా నిబంధనలు ఉన్నాయా..? ఉంటే వాటిని పాఠశాల యాజమాన్యం ఎలా అమలు చేస్తోంది..? విద్యార్థి విద్య, భద్రతకు ఇబ్బంది కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి..? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. ఫీజుల వసూళ్లతో పాటు విద్యార్థుల విద్య, భవిష్యత్తు, భద్రతకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని బాధితుడు పేర్కొన్నారు.

# గుండ్ల చెరువులో వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



ఆర్మూర్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టిన ఏర్పాట్లను నిజామాబాద్ జిల్లా కలెక్టర్ బావేష్ మిశ్రా, సీపీ సాయి చైతన్య శనివారం పరిశీలించారు. ఆర్మూర్ పట్టణంలోని గుండ్ల చెరువు వద్ద నిమజ్జనానికి సంబంధించి రహదారులు, భద్రతా ఏర్పాట్లు, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర సౌకర్యాలను వారు పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వీయ, తహసీల్దార్ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, మున్సిపల్ చైర్మన్ గోనె లహరి రఘు, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయి బాబా గౌడ్, ఆర్అండ్బీ డీఈ నాందేవ్, ఇరిగేషన్ డీఈ కృష్ణమూర్తి, ఆర్మూర్ సీఐ సత్యనారాయణ అధికారులు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మెండోరాలో ఘనంగా అన్నప్రసాద కార్యక్రమం





మెండోరా, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): మెండోర మండల కేంద్రంలో గంగపుత్ర సంఘం సభ్యుల ఆధ్వర్యంలో వినాయకుని సన్నిధిలో శనివారం ఘనంగా అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గంగపుత్ర కులసంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. సంఘ సభ్యులందరూ ఐకమత్యంతో కలిసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథుని ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు వారాల్లో పూర్తి సమాచారం ఇవ్వాలి

**- జేఎన్టీయూ పీఐఓకు సమాచార కమిషనర్ వైష్ణవి మెర్ల ఆదేశాలు.**

బోధన్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తుదారు కోరిన పూర్తి సమాచారాన్ని రెండు వారాల్లోగా అందించాలని తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ వైష్ణవి మెర్ల జేఎన్టీయూ పౌర సమాచార అధికారికి ఆదేశాలు జారీ చేశారు.


**17 అంశాలపై సమాచారం కోరిన ఆర్టీఐ కార్యకర్త.**

నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, ఆర్టీఐ కార్యకర్త మీర్జాపురం రామకృష్ణ 2024లో హైదరాబాద్లోని జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (జేఎన్టీయూ) కార్యాలయానికి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్నారు. యూనివర్సిటీ కార్యాలయానికి సంబంధించిన 17 అంశాలపై వివరాలు,



ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం వెల్లడించాల్సిన సమాచారానికి సంబంధించిన ప్రతులు ఇవ్వాలని కోరారు.

అలాగే కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం-2005కు సంబంధించిన బోర్డు ఫొటో/జిరాక్స్ కాపీతో పాటు జేఎన్టీయూ అనుబంధ కళాశాలల్లో



TELANGANA INFORMATION COMMISSION
Samachara Hakku Bhavan, M.J. Market, Hyderabad - 500001
https://tgic.gov.in

WEDNESDAY, THE TWENTY NINTH OF JULY, 2026
: PRESENT:
THE HON'BLE STATE INFORMATION COMMISSIONER
SMT. VAISHNAVI MERLA

Appeal Nos. 3088/SIC-VM/2024

Between: Sri M. Rama Krishna, S/o M.Sayanna, H.No.2-5-168, Harijanawada, Ward.No.23, Bodhan, Nizamabad District-503185. ... Appellant

And

The Public Information Officer (Under the Right to Information Act, 2005) O/o the Registrar, Jawaharlal Nehru Technological University Hyderabad (JNTUH), Kukatpally, Hyderabad - 500 085.

& The First Appellate Authority (Under the Right to Information Act, 2005), O/o the Vice Chancellor, Jawaharlal Nehru Technological University Hyderabad (JNTUH), Kukatpally, Hyderabad - 500 085. ... Respondents

ORDER

విద్యనభ్యసించిన విద్యార్థుల వివరాలు, ప్రైవేట్ కళాశాలలు మూసివేయబడిన సందర్భాల్లో ఆయా కళాశాలల్లో చదివిన విద్యార్థుల వివరాలు యూనివర్సిటీలో అందుబాటులో ఉన్నాయా? ఉంటే వాటికి సంబంధించిన సమాచారం ఇవ్వాలని కోరారు.

**అసంతృప్తికర సమాధానంపై కమిషన్ను ఆశ్రయించిన రామకృష్ణ.**

అయితే పీఐఓ నుంచి అందిన సమాచారం పూర్తిగా సంతృప్తికరంగా లేదని పేర్కొంటూ రామకృష్ణ తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ను ఆశ్రయించారు. దరఖాస్తు, అందిన సమాధానాలను పరిశీలించిన కమిషన్ కేసును నమోదు చేసి విచారణ చేపట్టింది.

ఈ క్రమంలో జేఎన్టీయూ పీఐఓను 29-07-2026న విచారణకు హాజరు కావాలని కమిషన్ నోటీసులు జారీ చేసింది. విచారణ అనంతరం దరఖాస్తుదారు కోరిన సమాచారాన్ని పరిశీలించిన సమాచార కమిషనర్ వైష్ణవి మెర్ల, రెండు వారాల్లోగా కోరిన పూర్తి సమాచారాన్ని రామకృష్ణకు అందించాలని జేఎన్టీయూ పీఐఓను ఆదేశించినట్లు రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

---

# రెండు వారాల్లో పూర్తి సమాచారం ఇవ్వాలి


**తండ్రి ఆశయాలే నా అడుగులు. ప్రజల కోసం నిరంతరం పోరాడతా**

**- ఆలూర్ గంగారెడ్డి 4వ వర్ధంతిలో కుమార్తె విజయభారతి.**



ఆర్మూర్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): ఆర్మూర్ నియోజకవర్గం ఆలూర్ గంగారెడ్డి 4వ వర్ధంతి వేడుకలు శనివారం ఆయన స్వగ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో ఘనంగా, భావోద్వేగపూరిత వాతావరణంలో నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై గంగారెడ్డి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రైతు సమస్యల పరిష్కారం, సమాజ సేవతో పాటు తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన సేవలను పలువురు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో గంగారెడ్డి, కుమార్తె విజయభారతి మాట్లాడుతూ., తన తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తన జీవిత లక్ష్యమని తెలిపారు. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన తన తండ్రి రైతుల సమస్యలపై పోరాడటంతో పాటు ఎర్రజొన్న ఉద్యమం, తెలంగాణ మలిదశ ఉద్యమంలో కేసీఆర్,తో కలిసి చురుగ్గా పనిచేశారని గుర్తుచేశారు.

తాను ఇంజనీరింగ్తో పాటు న్యాయవిద్యను పూర్తి చేశానని, చట్టపరంగా, సామాజికంగా ప్రజలకు ముఖ్యంగా రైతులు, మహిళలు, నిరుపేదలకు అండగా నిలుస్తానని విజయభారతి పేర్కొన్నారు. '(ఏజీఆర్) ఆలూర్ గంగారెడ్డి ఫౌండేషన్/ట్రస్ట్'ను మరింత బలోపేతం చేసి, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రైతులకు, అత్యవసర వైద్య సహాయం అవసరమైన వారికి, మహిళల సాధికారత కోసం విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడతానని స్పష్టం చేశారు. ప్రముఖ నేత అరవింద్ శర్మ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంతో పాటు ప్రాంత అభివృద్ధికి ఆలూర్ గంగారెడ్డి, చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఏజీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత నాలుగేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన 22 ఏళ్ల క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సహాయం అందించినట్లు పేర్కొన్నారు. భవిష్యత్లో ప్రతి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు, మహిళలకు క్యాన్సు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బార్ల మనీష్, గంగారెడ్డి, మహేందర్, సూర్యరెడ్డి, సవీన్, హరీష్తో పాటు ఆలూర్ గంగారెడ్డి ఆత్మీయులు, బంధుమిత్రులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



# భిక్కనూరు నుంచి క్యాసంపల్లికి తరలించడాన్ని వ్యతిరేకించిన నాయకులు

భిక్కనూరు, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): భిక్కనూరు మండల కేంద్రానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ను క్యాసంపల్లికి తరలించే ఆలోచనపై భిక్కనూరు మండల బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. పాఠశాలను భిక్కనూరులోనే నిర్మించాలని డిమాండ్ చేసింది. భిక్కనూరు పట్టణ అధ్యక్షుడు బొందువుల భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, భిక్కనూరులో పాఠశాల కోసం 20 ఎకరాల భూమి కేటాయించినట్లు పేర్కొన్నారు. అలాంటప్పుడు పాఠశాలను ఇతర ప్రాంతానికి తరలించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. గ్రామ పాలకవర్గం చొరవ లోపం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. భిక్కనూరుకు వచ్చే కీలకమైన విద్యాసంస్థను కాపాడేందుకు పాలకవర్గం ఏ చర్యలు తీసుకుందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుతో విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులతో పాటు రవాణా, వాణిజ్యం, చిన్న వ్యాపారాలు వంటి రంగాలు అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. పాఠశాల తరలింపుపై



ప్రభుత్వం, అధికారులు స్పష్టమైన కారణాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు ఉప్పరి రమేష్తో పాటు హరీష్, వెంకట నర్సింలు, సురేష్, సాయి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

**- కొంపల్లిలో ఆర్మూర్ కాంగ్రెస్ ఇంచార్జి వినయ్ కుమార్ రెడ్డితో జుక్కల్ అధికార ప్రతినిధి నల్లాల వినయ్ కుమార్ భేటీ.**



కామారెడ్డి, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు, ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వినయ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నల్లాల వినయ్ కుమార్ అన్నారు. శనివారం కొంపల్లిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఇరువురు నాయకులు సమావేశమై పార్టీ బలోపేతం, ప్రజా పాలన, ప్రభుత్వ పథకాలపై చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ పాలన, అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని పేర్కొన్నారు.

**ప్రజా పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలి.**

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను గ్రామస్థాయి నుంచి ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు చురుకుగా పనిచేయాలని నాయకులు సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.

**పార్టీ బలోపేతంపై చర్చ**

అనంతరం కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, కార్యకర్తలను సమన్వయం చేసుకుని ప్రజలకు చేరువ కావడం వంటి అంశాలపై ఇరువురు నాయకులు చర్చించారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వాస్తవాల ఆధారంగా వివరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పార్టీ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యతగా భావించి పనిచేయాలని పిలుపునిచ్చారు.

# రిమోట్ కంట్రోల్ పంచాయతీనా? భిక్కనూరు అభివృద్ధి ఎటు?

**భిక్కనూరు శ్రేయస్సు, అభివృద్ధే ముద్దు అంటున్న వార్డు సభ్యుడి వ్యాఖ్యలు.. పాలకవర్గంలో అంతర్గత విభేదాలపై చర్చ.**

భిక్కనూరు, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): రిమోట్ కంట్రోల్ గ్రామ పంచాయతీ వద్దు.. భిక్కనూరు శ్రేయస్సు, అభివృద్ధే ముద్దు అని భిక్కనూరు గ్రామ పంచాయతీకి చెందిన ఓ వార్డు సభ్యుడు చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. సాధారణంగా ఒక ప్రజాప్రతినిధి నుంచి ఇలాంటి వ్యాఖ్యలు వెలువడటం వెనుక పాలకవర్గంలో ఉన్న అంతర్గత విభేదాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఒకవైపు గ్రామ అభివృద్ధి కోసం పాలకవర్గం పనిచేస్తున్నామని చెబుతుండగా.. మరోవైపు అదే పాలకవర్గానికి చెందిన సభ్యుడే వ్యాఖ్యలు పంచాయతీ నిర్ణయాలు ఎవరి ఆధీనంలో జరుగుతున్నాయి?, అందరూ ఒకే మాటపై ఉన్నారా? అనే సందేహాలకు తావిస్తున్నాయి.

**ఇంటిగ్రేటెడ్ స్కూల్ వ్యవహారంలోనూ విభేదాల ప్రభావమా...?**

భిక్కనూరుకు రావాల్సిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ వంటి భారీ విద్యా మౌలిక వసతి ప్రాజెక్టు విషయంలో స్థానికంగా తీవ్ర చర్చ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రూపొందించింది. 2026లో ప్రభుత్వం తొలి దశలో 86 పాఠశాలలకు పరిపాలనా అనుమతులు ఇచ్చినట్లు అధికారికంగా, అలాగే నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నట్లు నివేదికలు వెల్లడించాయి. ఇలాంటి ప్రాధాన్యత కలిగిన విద్యా సంస్థ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమిష్టిగా ఒకే డిమాండ్ నిలబడి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేదా? అనే ప్రశ్న ఇప్పుడు ముందుకొస్తోంది. భిక్కనూరులో పాఠశాల విషయంలో ఇప్పటికే ప్రభుత్వ విద్యా సంస్థలు ఉన్నాయి. అధికారిక జిల్లా రికార్డుల్లో భిక్కనూరులో కేజీబీవీ, టీఎస్డబ్ల్యూఆర్ఈఐఎస్ పాఠశాలలు ఉన్నట్లు నమోదై ఉంది.

అందువల్ల ఒక భారీ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ గ్రామానికి దక్కితే విద్యా రంగంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు, రవాణా, స్థానిక సేవలు, చిన్న వ్యాపారాలు, అద్దె గృహాలు, మౌలిక వసతులు వంటి అనేక రంగాలపై దీర్ఘకాలిక ప్రభావం ఉండే అవకాశం ఉంది.




**అవకాశం వచ్చినప్పుడు ఐక్యత ఎక్కడ..?**

ఒక గ్రామానికి అరుదుగా వచ్చే పెద్ద ప్రాజెక్టు విషయంలో పాలకవర్గం మొత్తం ఒకే వేదికపైకి వచ్చి ప్రభుత్వాన్ని ఒప్పించే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉంటుంది.

కానీ ప్రస్తుతం వెలువడుతున్న వ్యాఖ్యలు మాత్రం ఎవరి దారి వారిదేనా? అనే చర్చకు కారణమవుతున్నాయి.

ప్రజల సమస్యలపై ఒకే గొంతుతో మాట్లాడాల్సిన ప్రజాప్రతినిధులు పరస్పరం భిన్నాభిప్రాయాలతో ఉంటే దాని ప్రభావం చివరికి గ్రామంపైనే పడుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అభివృద్ధి విషయంలో రాజకీయాలు ముందా? గ్రామ ప్రయోజనం ముందా?

**ఇదే ఇప్పుడు భిక్కనూరు ప్రజల ముందున్న ప్రధాన ప్రశ్న.**

**బాధ్యత ఎవరిది?**

ఇంటిగ్రేటెడ్ స్కూల్ భిక్కనూరులోనే ఉండాల్సిన అంశంపై ఎవరు ఏ సమయంలో ఏ ప్రయత్నం చేశారు? ప్రభుత్వ అధికారులతో ఎవరు మాట్లాడారు? గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి తీర్మానాలు జరిగాయి? ప్రజాప్రతినిధులంతా ఒకే అభిప్రాయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారా? స్థల ఎంపిక విషయంలో చివరి వరకు గ్రామ ప్రయోజనాన్ని కాపాడేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

ఇలాంటి ప్రశ్నలకు పారదర్శకమైన సమాధానాలు రావాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఒకసారి ఒక పెద్ద విద్యా ప్రాజెక్టు గ్రామం నుంచి దూరమైతే, అది కేవలం ఒక భవనం కోల్పోవడం మాత్రమే కాదు. దాని ద్వారా వచ్చే విద్యా అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, ఆర్థిక కార్యకలాపాలు వంటి అనుబంధ ప్రయోజనాలు కూడా గ్రామానికి దూరమయ్యే అవకాశం ఉంటుంది.

**రిమోట్ కంట్రోల్ వ్యాఖ్యపై పాలకవర్గం స్పందించాలి.**

ఓ వార్డు సభ్యుడు స్వయంగా రిమోట్ కంట్రోల్ గ్రామ పంచాయతీ వద్దు అని వ్యాఖ్యానించడం సాధారణ వ్యాఖ్యగా తీసుకునే అంశం కాదని స్థానికులు అంటున్నారు. ఆ వ్యాఖ్య వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటి? పంచాయతీ నిర్ణయాలపై ఎవరి ప్రభావం ఉందనే భావన ఎందుకు వ్యక్తమైంది?

**పాలకవర్గ సభ్యుల మధ్య అసలు భేదాభిప్రాయాలు ఏమిటి? ప్రజలకు తెలియాల్సిన అంశాలివే...**

భిక్కనూరు అభివృద్ధి ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదు. అది మొత్తం గ్రామ ప్రజల హక్కు.

అందుకే ఇంటిగ్రేటెడ్ స్కూల్ వ్యవహారంపై కూడా పరస్పర ఆరోపణలకంటే వాస్తవాలు, అధికారిక నిర్ణయాలు, తీసుకున్న చర్యలు, బాధ్యత వహించిన వ్యక్తుల వివరాలు ప్రజల ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

**అవకాశం పోయిందా.. లేక ఇంకా పోరాడే అవకాశం ఉందా?**

ఇప్పటికే పరిస్థితి పూర్తిగా ముగిసిపోయిందని తేల్చే ముందు, సంబంధిత అధికారుల అధికారిక నిర్ణయాలు, స్థల ఎంపికకు సంబంధించిన రికార్డులు, ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు ప్రజలకు అందుబాటులోకి రావాలి. ఒకవేళ భిక్కనూరుకు దక్కాల్సిన అవకాశాన్ని కోల్పోయినట్లయితే దానికి కారణాలు ఏమిటో ప్రజలకు స్పష్టంగా తెలియాలి. ఎందుకంటే నష్టం జరిగినా దాని భారం ఒక్కరి మీద పడదు. భిక్కనూరు ప్రజలే భరించాల్సి వస్తుంది. అందుకే ఇప్పుడు అవసరమైనది పరస్పర నిందలు కాదు -

**ఐక్యత, పారదర్శకత, బాధ్యత.**

**ప్రజల ప్రశ్న ఒక్కటే..**

భిక్కనూరు అభివృద్ధికి వచ్చిన అవకాశం జారిపోతే.. బాధ్యత ఎవరిది? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సింది ఒక్క వ్యక్తి కాదు. గ్రామ ప్రయోజనం కోసం పనిచేస్తున్న ప్రతి ప్రజాప్రతినిధి, ప్రతి పాలకవర్గ సభ్యుడు ప్రజల ముందుకు వచ్చి తమ వంతు బాధ్యతను వివరించాల్సిన సమయం వచ్చింది.

# సెంటర్ డివైడర్ లైటింగ్ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న సెంటర్ డివైడర్ లైటింగ్ పనులను మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ పరిశీలించారు. లైటింగ్ పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.



అలాగే గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని పురస్కరించుకుని నిమజ్జన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పద్మ శ్రీకాంత్ మాట్లాడుతూ., నిమజ్జన కార్యక్రమం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, తాగునీరు, భద్రతా చర్యలు తదితర ఏర్పాట్లను ముందస్తుగా చేపట్టాలని అధికారులకు సూచించారు. మరియు ప్రత్యేకంగా యువతకు ఒక విజ్ఞప్తి చేశారు నిమజ్జనం సమయంలో ఉత్సాహంతో పాటు బాధ్యత కూడా ఉండాలి. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. ఇతరులకు ఇబ్బంది కలగకుండా శాంతియుతంగా ఊరేగింపు నిర్వహించాలి. చెరువులు, కాలుష్యం విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ పర్యావరణహితంగా నిమజ్జనం జరుపుకోవాలి అని చైర్మెన్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె జగ్జీవన్ మరియు వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొని నిమజ్జన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

# ఉపాధ్యాయ సేవలకు రాష్ట్రస్థాయి గుర్తింపు



మెండోరా, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గానికి చెందిన ఆరుగురు ప్రైవేట్ ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందుకున్నారు. శనివారం హైదరాబాద్లోని బిర్లా ప్లానిటోరియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి గురుపూజోత్సవ కార్యక్రమంలో వారికి ఈ పురస్కారాలను ప్రదానం చేశారు.

బాల్కొండకు చెందిన సుబ్బారెడ్డి, సత్యనారాయణ, వన్నెల్ బి గ్రామానికి చెందిన వసంత్ రెడ్డి, నాగంపేటకు చెందిన భూమేశ్వర్, పోచంపాడ్కు చెందిన సత్యం, మెండోరాకు చెందిన రాజేందర్ లకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికై సత్కారం అందుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారి విద్యాభివృద్ధికి చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాలు లభించడంతో ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో ఒకే నియోజకవర్గానికి చెందిన ఆరుగురు ఉపాధ్యాయులు పురస్కారాలు అందుకోవడం బాల్కొండ నియోజకవర్గానికి గర్వకారణమని పలువురు అభినందించారు. ఈ పురస్కారం తమ ఉపాధ్యాయ జీవితంలో మరుపురాని ఘట్టంగా నిలిచిపోతుందని అవార్డు గ్రహీతలు పేర్కొన్నారు.



# భక్తి శ్రద్ధలతో వినాయక నవరాత్రుల ముగింపు

- మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక పూజలలో పాల్గొన్న చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్.
- భక్తులకు అన్నప్రసాద వితరణ. రూ 42,500కు లడ్డూ వేలం, కైవాసం చేసుకున్న డీఈ. హన్మంతరావు.





కార్యక్రమంలో డీఎస్పీ మధుసూదన్, సీఐ నరహరి



కామారెడ్డి, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వినాయకచవితి నవరాత్రుల వేడుకలు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. నవరాత్రుల ముగింపు సందర్భంగా అన్నప్రసాద కార్యక్రమం, ప్రత్యేక పూజలు, వినాయక శోభాయాత్ర, లడ్డూ వేలం నిర్వహించారు. మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొని వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ., వినాయకచవితి నవరాత్రులను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి వెల్లివిరియాలని ప్రార్థించారు.

నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయం నుంచి వినాయక శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం లడ్డూ వేలం పాట నిర్వహించగా డీఈ హన్మంతరావు రూ.42,500కు లడ్డూను దక్కించుకున్నారు. దీంతో నిర్వాహకులు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ మధుసూదన్, సీఐ నరహరి, ఎంఆర్ఓ హిమబిందు, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



## విద్యాప్రగతిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

సదాశివనగర్, సెప్టెంబర్ 19(మనం న్యూస్): విద్యార్థుల విద్యా ప్రగతిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని, తల్లిదండ్రులు తప్పనిసరిగా భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ రాజిరెడ్డి అన్నారు. శనివారం సదాశివనగర్ మండలంలోని ఆదర్శ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచడంపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా పేరెంట్స్ - టీచర్ సమావేశాలకు హాజరై పిల్లల చదువు, ప్రగతి గురించి ఉపాధ్యాయులను తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు రోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. ఏదైన కార ణంతో కొద్ది రోజులు పాఠశాలకు రాలేకపోతే వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం అందించాలని, తద్వారా వారు వినని పాఠాలను ప్రత్యేకంగా బోధించే అవకాశం ఉంటుందన్నారు.





# వెల్గటూర్లో ఘనంగా పోషణమాసం

- గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు.. చిన్నారులకు అన్నప్రాసన.



మెండోరా, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): పోషణ మాసం కార్యక్రమాల్లో భాగంగా వెల్గటూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు పండ్లు, పూలు, గాజులు అందించి సంప్రదాయబద్ధంగా శ్రీమంతం నిర్వహించారు.

గర్భధారణ సమయంలో సమతుల్య ఆహారం తీసుకోవడం, పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను వినియోగించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించడం వంటి అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. గర్భిణీలు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

అలాగే చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించి, వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులకు చిన్న వయసు నుంచే పోషకాహారం అందించడం ద్వారా శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందని వివరించారు. పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోషణ మాసం ప్రధాన ఉద్దేశం గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహార ప్రాధాన్యతను వివరించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించడమేనని నిర్వాహకులు తెలిపారు. తల్లులు, పిల్లల ఆరోగ్యంపై కుటుంబ సభ్యులు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కావ్య సతీష్, మండల ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షులు బద్దం శ్రీనివాస్, సూపర్వైజర్ అనురాధ, ఏఎన్ఎం ప్రమీల, అంగన్వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## మగ్గిడి హైస్కూల్లో యూనిఫామ్, షూస్ పంపిణీ

ఆర్మూర్, సెప్టెంబర్ 19(మనం న్యూస్): ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామం పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్, షూస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ చంద్రకాంత్ గౌడ్, విద్యార్థులకు యూనిఫామ్స్, షూస్ అందజేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు హరిత, పంచాయతీ కార్యదర్శి విద్యాసాగర్, వార్డు మెంబర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.






## వర్ని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన అసిస్టెంట్ కలెక్టర్

బోధన్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): బోధన్ డివిజన్ వర్ని మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం అసిస్టెంట్ కలెక్టర్ సురేష్ ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలోని రికార్డులు, రిజిస్టర్ లను తనిఖీ చేశారు. ఆసుపత్రి వైద్యులు స్నేహ పద్మజలను ఆసుపత్రి వచ్చే రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.

# హిందీ భాషా మాధుర్యాన్ని అందరికీ పంచాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్.
- 'హిందీ అభ్యాస దీపిక' స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ, హిందీ పండితులకు సన్మానం.
- విద్యార్థులకు పోటీల్లో బహుమతుల ప్రదానం, ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు




కామారెడ్డి, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): హిందీ భాషా మాధుర్యాన్ని సమాజంలోని ప్రతి ఒక్కరికీ చేరవేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్ అన్నారు. కామారెడ్డిలోని వరలక్ష్మి గార్డెన్స్లో జిల్లా హిందీ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ దివస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో అత్యధికంగా మాట్లాడే భాషల్లో హిందీకి ప్రత్యేక స్థానం ఉందని, జనసంపర్క భాషగా విశేష ప్రాధాన్యం పొందుతోందన్నారు. హిందీ భాషను ప్రతి ఒక్కరూ ఆదరించి అభ్యసించాలని పిలుపునిచ్చారు. శాతవాహన విశ్వవిద్యాలయం అధ్యాపకులు ప్రొఫెసర్ వాసాల వరప్రసాద్ మాట్లాడుతూ., హిందీ సాహిత్యంలోని విలువలు, వైభవాన్ని వివరించారు. బిబిపేట ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయులు నర్సింలు పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన 'హిందీ అభ్యాస దీపిక'ను డీఈఓ ఆవిష్కరించారు. హిందీ దివస్ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వివిధ మండలాలకు చెందిన సీనియర్ హిందీ పండితులను సన్మానించారు. విద్యార్థులు హిందీ పాటలు, నృత్యాలు, నాటికలు, దేశభక్తి గేయాలతో అలరించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు బలరాం, నీలం లింగం, వేణు శర్మ, హిందీ ఫోరం అధ్యక్షుడు ఇంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సహేందర్నాథ్, కోశాధికారి విక్రమ్కుమార్ తదితరులు పాల్గొన్నారు.







# కోర్టు భవన సముదాయానికి నిధులు మంజూరు చేయాలి

- పలు డిమాండ్లతో ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీని కలిసిన న్యాయవాదుల బృందం.
- క్యాసంపల్లి శివారులో నిర్మించనున్న నూతన కోర్టు భవనానికి త్వరగ నిధులు మంజూరు చేయాలి.
- 10 కోర్టులతో పాటు ఫ్యామిలీ, పోక్సో కోర్టులకు అవసరమైన వసతులు కల్పించాలి.
- గతంలో సబ్కోర్టు మంజూరులో సహకరించిన విధంగా చొరవ చూపాలని న్యాయవాదుల విజ్ఞప్తి.

కామారెడ్డి, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): కామారెడ్డి పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు కానున్న 10 కోర్టులు, ఫ్యామిలీ, పోక్సో కోర్టులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ కామారెడ్డి బార్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి శనివారం వినతిపత్రం అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల నారాయణ ఆధ్వర్యంలో న్యాయవాదుల బృందం ఆయనను కలిసి తమ సమస్యలను వివరించింది.

## నిధులను త్వరగా మంజూరు చేయించాలి

క్యాసంపల్లి శివారులో ప్రతిపాదిత కోర్టు భవన సముదాయ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులను త్వరగా మంజూరు చేయించేందుకు సహకరించాలని న్యాయవాదులు కోరారు. గతంలో షబ్బీర్ అలీ కృషితో కామారెడ్డికి సబ్కోర్టు మంజూరైన విషయాన్ని ప్రస్తావించారు. అదే విధంగా నూతన కోర్టు భవన సముదాయానికి కూడా నిధులు సమకూరేలా ప్రభుత్వ స్థాయిలో చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది శ్యామ్ గోపాలరావు, సీనియర్ న్యాయవాదులు జగన్నాథం, వెంకట్ రాంరెడ్డి, నిమ్మ దామోదరరెడ్డి, కె. వేణుగోపాలరావు, సూర్య ప్రసాద్, షబానా బేగం, ఆర్. దేవేందర్, రాజా బాబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.






# తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరిన షేక్ మతీన్

రుద్రూర్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): బాన్సువాడ నియోజకవర్గ టీడీపీ పార్టీ ఇంచార్జ్ రుద్రూర్ మండలం రాయకూర్ క్యాంపు గ్రామానికి చెందిన షేక్ మతీన్ హైదరాబాద్ లో తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మతీన్, ఆయన అనుచరులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆయనకు పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# పింఛన్ల పేరుతో మోసం చేస్తే కఠిన చర్యలు

- మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్.
- పింఛన్లకోసం దళారులను నమ్మొద్దు, అర్హుల ఖాతాల్లోకే నేరుగా నగదు. ఇంటి వద్ద ఆన్లైన్ ఫొటో వెరిఫికేషన్.



కామారెడ్డి, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): 'చేయూత' పింఛన్ల పథకం పేరుతో లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసే దళారులు, మధ్యవర్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ హెచ్చరించారు. పింఛన్ ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే మోసపోవద్దని, వెంటనే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. పింఛన్ల పంపిణీకి ఎలాంటి మధ్యవర్తుల అవసరం లేదన్నారు. అర్హులైన వారికి పింఛన్ నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దే అధికారులు ఆన్లైన్ ఫొటో వెరిఫికేషన్ నిర్వహిస్తారని చెప్పారు. పేదల నుంచి డబ్బులు వసూలు చేస్తూ ప్రభుత్వ పథకాలను అడ్డుపెట్టుకుని మోసాలకు పాల్పడే వారిని ఉపేక్షించబోమన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, డబ్బులు అడిగే వారి వివరాలను అధికారులకు తెలియజేయాలని కోరారు.

# నవరాత్రుల సందర్భంగా వారియర్స్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం



భీమ్గల్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): గణపతి నవరాత్రుల సందర్భంగా బెజ్జోరా గ్రామంలో వారియర్స్ యూత్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి భక్తులకు ఆహారాన్ని అందిస్తూ వారియర్స్ యూత్ సభ్యులు తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న వారియర్స్ యూత్ సభ్యులను ముఖ్య అతిథులు అభినందించారు.

ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు బోధిరే స్వామి, పట్టణ అధ్యక్షులు జేజే నర్సయ్య, జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ నాగేంద్రబాబు, సుంకరి సురేష్, మేకల శ్రీనివాస్, భోజ రాకేష్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

# సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**- యువత మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలి.**

**- ఎన్ఎన్ హ్యాకథాన్-2026లో పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య**







నిజామాబాద్, సెప్టెంబర్ 19 (మనం జిల్లా ప్రతినిధి): మారుతున్న కాలానికి అనుగుణంగా యువత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవడంతో పాటు దానిని ప్రజా ప్రయోజనాలకు, సమాజ శ్రేయస్సుకు సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సూచించారు. శనివారం ఎన్ఎన్ ఏఐ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో నిజామాబాద్ ఐటీ టవర్స్లో నిర్వహించిన ఎన్ఎన్ హ్యాకథాన్-2026 - కోడ్ ఫర్ చేంజ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హ్యాకథాన్లో పాల్గొన్న విద్యార్థులు, యువత, సాంకేతిక నిపుణులతో పోలీస్ కమిషనర్ ముచ్చటించారు. వారు రూపొందించిన కృత్రిమ మేధస్సు ఆధారిత ప్రాజెక్టులు, వినూత్న ఆలోచనలు, సమస్యల పరిష్కార విధానాలను పరిశీలించారు.

ప్రస్తుత ఆధునిక సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ కీలకంగా మారుతోందని సాయి చైతన్య పేర్కొన్నారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వివిధ సామాజిక



సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలను రూపొందించే అవకాశం ఉందన్నారు. యువతలో ఉన్న సృజనాత్మకత, ఆలోచనా శక్తి, సాంకేతిక నైపుణ్యాలను సరైన దిశలో వినియోగిస్తే సమాజానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. కోడ్ ఫర్ చేంజ్ వంటి కార్యక్రమాలు యువతను సాంకేతిక రంగంలో మరింత ప్రోత్సహించడంతో పాటు, సమాజానికి ఉపయోగపడే వినూత్న పరిష్కారాలను రూపొందించేందుకు మంచి వేదికగా నిలుస్తాయని అన్నారు. పోలీసింగ్ వ్యవస్థలోనూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజా భద్రత, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, సమాచార విశ్లేషణ, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

యువత కేవలం సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవడమే కాకుండా, దానిని ప్రజా ప్రయోజనం, సమాజ శ్రేయస్సు, దేశ అభివృద్ధికి ఉపయోగపడే విధంగా వినియోగించాలని సూచించారు.

**రోడ్డు భద్రతపై అవగాహన అవసరం.**

యువత రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని పోలీస్ కమిషనర్ సూచించారు. 2025 సంవత్సరంలో రోడ్డు ప్రమాదాల కారణంగా జిల్లా వ్యాప్తంగా 327 మంది ప్రాణాలు కోల్పోయారని, కొవిడ్ సమయంలో సైతం సుమారు 200 మంది మృతి చెందారని ఆయన గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అదేవిధంగా యువత సైబర్ నేరాల పట్ల అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం హ్యాకథాన్లో పాల్గొన్న విద్యార్థులు, యువతను పోలీస్ కమిషనర్ ప్రశంసా పత్రాలతో అభినందించారు.

కార్యక్రమంలో ఎన్ఎన్ ఏఐ సొల్యూషన్స్ సీఈఓ నజీబ్, మేనేజర్ షేక్ సబ్బీర్, కాకతీయ ప్రిన్సిపాల్ రజనీకాంత్, సంస్థ ప్రతినిధులు, కార్యక్రమ నిర్వాహకులు, సాంకేతిక నిపుణులు, విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.



# ఎండిన బోర్లకు రీఛార్జ్.. భూగర్భ జలాలకు అభివృద్ధి

సదాశివనగర్, సెప్టెంబర్ 19(మనం న్యూస్): వర్షపు నీటిని భూమిలోకి పంపి ఎండిన బోరు బావులను రీఛార్జి చేసుకోవాలని డిఆర్డిఓ పిడి దామోదర్ రెడ్డి అన్నారు. శనివారం సదాశివనగర్ మండలం మర్కల్ గ్రామంలో భూగర్భ జలాల పెంపు కోసం నిర్మించిన బోర్ రీఛార్జ్, సోక్ ఫిట్ నిర్మాణం, అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూగర్భ జలమట్టాల పెంపు మరియు ఎండిపోయిన బోరుబావుల పునరుద్ధరణ చేయాలని కోరారు. గ్రామాల్లో వాడుక నీరు వృధాగా రోడ్లపైకి రాకుండా, నేరుగా భూమిలోకి ఇంకిపోయేలా వ్యక్తిగత మరియు కమ్యూనిటీ సోక్ పిట్లను నిర్మాణం చేసుకోవాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా పిల్లలకు నేర్పిస్తున్న విద్యా బోధనలు పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రియాంక సుభాష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గోదావరి, టెక్నికల్ అసిస్టెంట్ స్వామి, గ్రామస్తులు ఉన్నారు.



# పాముకాటుకు వైద్యం అత్యవసర పరిస్థితి

**- సకాలంలో వైద్యం పొందితే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చు.**

**- తెలంగాణ యూనివర్సిటీలో పాముకాటుపై అవగాహన కార్యక్రమం.**



నిజామాబాద్ రూరల్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): పాముకాటుకు గురైన వ్యక్తికి సకాలంలో సరైన ప్రథమ చికిత్స అందించి, వెంటనే ఆసుపత్రికి తరలిస్తే ప్రాణనష్టం, వైకల్యాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలంగాణ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం యూనిట్-2 ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ హలీం ఖాన్ తెలిపారు. అంతర్జాతీయ పాముకాటు అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ సేవా పథకం యూనిట్-2 ఆధ్వర్యంలో పాముకాటు నివారణ, ప్రథమ చికిత్స, సకాలంలో వైద్యం పొందడంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హలీం ఖాన్ మాట్లాడుతూ., పాముకాటు ఒక వైద్య అత్యవసర పరిస్థితి అని తెలిపారు. పాముకాటుకు గురైన వ్యక్తిని వీలైనంత త్వరగా సమీపంలోని ఆసుపత్రికి తరలించాలని సూచించారు. బాధితుడిని ప్రశాంతంగా ఉంచి, కదలికలను తగ్గించాలని, కాటుకు గురైన అవయవాన్ని స్థిరంగా ఉంచాలని వివరించారు. ఉంగరాలు, గాజులు, గడియారాలు వంటి బిగుతైన వస్తువులను వాపు వచ్చేలోపే తొలగించాలని సూచించారు.

పాము కాటేసినప్పుడు గాయాన్ని కోయడం, విషాన్ని నోటితో పీల్చడం, ఐస్ లేదా రసాయనాలు రాయడం, బిగుతుగా టోర్నికెట్ కట్టడం, నాటు వైద్యం చేయించడం వంటి అపోహలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. పామును పట్టుకోవడానికి లేదా చంపడానికి ప్రయత్నించకూడదని, సురక్షితంగా ఉంటే దూరం నుంచి ఫొటో తీసి వైద్యులకు చూపించవచ్చని తెలిపారు. పాముకాటుపై శాస్త్రీయ అవగాహన పెంచుకోవడంతో పాటు తక్షణమే సరైన వైద్యం పొందడం, ప్రథమ చికిత్సపై అవగాహన కలిగి ఉండటం ద్వారా పాముకాటు వల్ల సంభవించే ప్రాణనష్టం, వైకల్యాలను గణనీయంగా తగ్గించవచ్చని డాక్టర్ హలీం ఖాన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



# సర్కార్ ముళ్ల కంప.. ఉపయోగమా? ఉపద్రవమా?

**మనం న్యూస్ ప్రత్యేక కథనం**

నిజామాబాద్ రూరల్, సెప్టెంబర్ 16 (మనం న్యూస్): పల్లెల్లో ఖాళీ ప్రదేశాలు, చెరువుల గట్ల వెంట, రహదారుల పక్కన ఎక్కడ చూసినా దట్టంగా పెరిగే ముళ్ల కంపలు కనిపిస్తుంటాయి. స్థానికంగా వీటిని సర్కార్ ముళ్ల కంప అని పిలుస్తారు. ఒకప్పుడు పనికిరాని బంజరు భూములను పచ్చదనంతో నింపేందుకు తీసుకొచ్చిన ఈ మొక్క.. కాలక్రమంలో వేగంగా విస్తరించి రైతులకు ఇబ్బందిగా మారిన ప్రొసోపిస్ జులిఫ్లోరాగా మారింది.



**విదేశాల నుంచి వచ్చిన మొక్క.**

ప్రొసోపిస్ జులిఫ్లోరా మన దేశానికి చెందిన స్వదేశీ వృక్షం కాదు. ఇది మధ్య, దక్షిణ అమెరికా ప్రాంతాలకు చెందిన మొక్క. భారతదేశంలో దీని ప్రవేశానికి సంబంధించి వేర్వేరు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. 19వ శతాబ్దం రెండో భాగంలో ఎండలు, కరువు పరిస్థితులను తట్టుకునే మొక్కగా దీనిని భారత్లో ప్రవేశపెట్టినట్లు పరిశోధనా ఆధారాలు చెబుతున్నాయి. 1870లలో మద్రాస్ ప్రెసిడెన్సీ పరిధిలోని ఎండ ప్రాంతాల్లో దీని సాగు ప్రారంభమైనట్లు కూడా నమోదైంది. ఎండను, నీటి కొరతను తట్టుకుని వేగంగా పెరగడం, బంజరు భూముల్లో కూడా నిలదొక్కుకోవడం దీని ప్రత్యేకత. అందుకే మొదట్లో ఇంధన కలప, నేల కోత నివారణ, ఇసుకను అడ్డుకోవడం, పచ్చదనం పెంచడం వంటి ఉద్దేశాలతో దీనిని ప్రోత్సహించారు.

**ఉపయోగాలు ఎన్నో..**

ఈ చెట్టును పూర్తిగా పనికిరానిదిగా చెప్పలేం. దీని కలపను కట్టెలు, బొగ్గు, కంచెలు, గుంజలకు తదితర అవసరాలకు ఉపయోగిస్తారు. పూల ద్వారా తేనెటీగలకు మకరందం లభిస్తుంది. కొన్ని ప్రాంతాల్లో దీని కాయలను మేకలకు గొర్రెకు మేతగా ఉపయోగిస్తున్నారు. తెలంగాణలో కూడా ప్రొసోపిస్ జులిఫ్లోరాను ఇంధన కలపగా, నేల కోతను అడ్డుకునేందుకు ఉపయోగిస్తున్నట్లు అధ్యయనాల్లో నమోదైంది.

**కానీ.. విస్తరణే పెద్ద సమస్య**

ఇదే సమయంలో ఈ మొక్కను ఆక్రమణ జాతిగా కూడా పరిగణిస్తారు. అనుకూల పరిస్థితుల్లో ఇది వేగంగా విస్తరించి దట్టమైన పొదలుగా మారుతుంది. దీంతో స్థానిక గడ్డి, చిన్న మొక్కలు పెరిగే స్థలం తగ్గిపోవచ్చు. వ్యవసాయ భూములు, మేత భూములు, చెరువు పరిసరాల్లో విస్తరించినప్పుడు రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుంది.

**సర్కార్ ముళ్ల కంప.. కథలో మరో కోణం.**

ఒకప్పుడు బంజరు భూమికి పచ్చని రూపం ఇవ్వాలని తీసుకొచ్చిన మొక్క.. నేడు అదే భూమిలో ఇతర స్థానిక వృక్షజాతులకు పోటీగా మారింది. అందుకే ఈ చెట్టును కేవలం మంచిది లేదా చెడ్డది అని తేల్చడం కంటే, ఎక్కడ పెరుగుతోంది, ఎంత విస్తరించింది, స్థానిక పర్యావరణంపై ఎలాంటి ప్రభావం చూపుతోంది, దాని కలపను ఎలా ఉపయోగిస్తున్నారు అనే అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. పల్లె పొలిమేరల్లో ముళ్ల కంపగా కనిపిస్తున్న ఈ చెట్టు వెనుక కూడా వందేళ్లకు పైబడిన ఒక చరిత్ర ఉంది. మన దేశానికి విదేశాల నుంచి వచ్చిన ఈ మొక్క.. కాలక్రమంలో తెలంగాణ పల్లె జీవనంలో భాగమైపోయింది. ఉపయోగం ఉన్నా, అదుపు లేకుండా విస్తరిస్తే పర్యావరణానికి సమస్యగా మారే మొక్కగా ఇది నిలిచింది.

## జాతీయ అహింసా మహాయజ్ఞంకు తరలిరావాలి

**- వచ్చే వారికి ఉచిత వసతి సౌకర్యం.**




బోధన్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): ప్రపంచ శాంతి కోసం అక్టోబర్ నెల ఒకటవ తేదీ నుండి అయిదవ తేదీ వరకు హైద్రాబాద్ లోని నాంపల్లి పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించనున్న జాతీయ అహింస మహా యజ్ఞం కార్యక్రమంకు వచ్చే వారి కోసం ఉచిత వసతి రూం ఏర్పాటు చేయడం జరిగిందని, రూమ్ కావలసిన వారు 20 తేదీ లోపు ముందుగా సంప్రదించాలని దివ్య శ్రీవాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రూములు కావాల్సినవారు 6301529332, 8106599878 ఈ నంబర్లకి సంప్రదించాలని తెలిపారు.



## చిక్కడపల్లిలో గణేష్ నిమజ్జన శోభయాత్ర

రుద్రూర్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): రుద్రూర్ మండలం చిక్కడపల్లి గ్రామంలో ఏకదంతాయ గణేష్ మండలి ఆధ్వర్యంలో శనివారం గణేష్ నిమజ్జన శోభాయాత్రను అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి శోభయాత్ర ప్రారంభించారు. ఈ శోభాయాత్ర ప్రధాన వీధుల గుండా కొనసాగింది. అనంతరం గణనాథుని గ్రామ శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు. ఈ శోభయాత్రలో సర్పంచ్ మచ్కూరి రమేష్, గణేష్ మండలి సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గెలుపోటములు క్రీడల్లో సహజమే

## : ఇప్ప ఉమారాణి శ్రీనివాస

**- రాజంపేటలో మండల స్థాయి క్రీడా పోటీల ముగింపు ఉత్సవాలు.**


**- ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, విజేతలకు బహుమతిప్రధానం.**

**- తల్లిదండ్రులు, గురువులు, సొంతూరికి పేరు తీసుకురావాలని సూచన.**




కామారెడ్డి, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): కామారెడ్డి నియోజకవర్గంలోని రాజంపేటలో మండల స్థాయి క్రీడ పోటీల ముగింపు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి కామారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని ఉమారాణి శ్రీనివాస్ అన్నారు. విజయం సాధించిన క్రీడాకారులు అదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఓటమి ఎదురైన వారు నిరుత్సాహపడకుండా గెలవాలనే తపనతో సాధన కొనసాగించాలని చెప్పారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభతో తల్లిదండ్రులు, గురువులు, పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఆకుల బాబు, దోమలగూడ స్పోర్ట్స్ స్కూల్ ఫ్యాకల్టీ శివరాజు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు, పీఆర్టీయూ అధ్యక్షుడు సంతోష్, స్వామిగౌడ్, సాయి మౌర్య, సంఘగౌడ్, బాలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రికార్డు తనిఖీకి అనుమతి



బోధన్, సెప్టెంబర్ 19 ( మనం న్యూస్): బోధన్ పట్టణంకి చెందిన సహ చట్టం కార్యకర్త మీర్జాపురం రామకృష్ణ గత నెలలో బోధన్ పట్టణం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయానికి సమాచార హక్కు చట్టం 2005 లోని సెక్షన్ టు జె వన్ కింద సమాచార చట్టంలోని 4(1) బి కి సంబంధించిన రికార్డులను తనిఖీ చేసుకోవడానికి ధరకాస్తు చేసుకున్నాడు. దరఖాస్తును పరిశీలించిచిన కార్యాలయం సహాయ ప్రజా సమాచార అధికారి కార్యాలయం పనివేళలల్లో ఎప్పుడైనా కార్యాలయానికి వచ్చి రికార్డు తనిఖీ చేసుకోవచ్చని అనుమతి లేఖను పంపినారని రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. భారత దేశ పౌరులు ఎవరైనా, ఎప్పుడైనా ప్రభుత్వ కార్యాలయంలో రికార్డు తనిఖీ కోసం ధరకాస్తు చేసువచ్చునని తెలిపారు. రికార్డు తనిఖీ సమయంలో తనతో పాటు ఒక వ్యక్తిని సహాయంగా తీసుకెళ్ళవచ్చని, మొదటి రికార్డు తనిఖీ ఒక గంట సేపు ఉచితంగా తనిఖీ చేసుకోవచ్చని తదుపరి ప్రతి గంటకు అయిదు రూపాయలు రుసుము చెల్లించాల్సి ఉంటుందని, రికార్డు తనిఖీ సమయంలో తమకు కావలసిన పత్రాలను ఫోటో, వీడియో తీసుకోవచ్చని సమాచార హక్కు చట్టంకు సంబంధించిన ఏమైనా సలహాలు, సూచనలు అవసరమున్న తనను సంప్రదించాలని అన్నారని తెలిపారు.



# హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

**- ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చే వరకు ఉద్యమాలు కొనసాగిస్తాం.**

**- సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి. రామకృష్ణ.**




నిజామాబాద్ రూరల్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్); ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి. రామకృష్ణ ఆరోపించారు. శనివారం సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎన్నికల ముందు ప్రజలకు అనేక హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించడం పాలక పార్టీలకు ఆనవాయితీగా మారిందని రామకృష్ణ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రైతులు, మహిళలు, కార్మికులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆయన ఆరోపించారు.

రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదని ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఏటా ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి, మరోవైపు ఉన్న ఉద్యోగాలపై కూడా ప్రభావం చూపే విధానాలను అవలంబిస్తున్నారని విమర్శించారు. ప్రజలపై వివిధ రకాల పన్నులు, ఆర్థిక భారాలు పెంచుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారంలోకి రాకముందు ప్రజలకు ఇచ్చిన పలు హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని రామకృష్ణ అన్నారు. మహిళలకు సంబంధించిన పథకాలు, రైతుల రుణమాఫీ, పంటలకు బోనస్ తదితర అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

అయితే, రుణమాఫీ, రైతు భరోసా, సన్నరకం వరికి బోనస్ తదితర అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన చర్యలను అధికారికంగా ప్రకటించిన రికార్డులు కూడా ఉన్నాయి. 2026లో తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా కింద నిధులు విడుదల చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వమే వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వంపై సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకులు చేసిన విమర్శలకు సంబంధించి, కేంద్రం మాత్రం ఎం.ఎస్.పి విధానాన్ని కొనసాగిస్తూ 22 పంటలకు కనీస మద్దతు ధరలు నిర్ణయిస్తున్నట్లు, 2018-19 నుంచి ఉత్పత్తి వ్యయంపై కనీసం 50 శాతం మార్జిన్ సూత్రాన్ని అమలు చేస్తున్నట్లు అధికారికంగా పేర్కొంది.

**రాజకీయ శిక్షణ తరగతులు.**

పార్టీ సభ్యులకు పలు అంశాలపై రాజకీయ అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించినట్లు రామకృష్ణ తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై చర్చించడంతో పాటు ప్రజా సమస్యలపై కార్యకర్తలకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కేంద్ర ప్రభుత్వంపై యూపీఐ చార్జీలకు సంబంధించి చేసిన విమర్శల విషయంలో ప్రస్తుతం అధికారికంగా వ్యక్తుల మధ్య యూపీఐ లావాదేవీలకు ఎలాంటి ఛార్జీలు ఉండవని, 2,000 వరకు చిన్న వ్యాపారుల లావాదేవీలకు కూడా జీరో ఎండీఆర్ కొనసాగుతుందని కేంద్ర ఆర్థిక శాఖ సెప్టెంబర్ 15న స్పష్టం చేసింది. ఈ సమావేశంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకులు ఆర్. దామోదర్, బి. బాబన్న, బి. కిశోర్, మండల నాయకులు ఎం. లింబాద్రి, ఎస్. కిషోర్, ఎం. అనీష్, ఎల్. ఆశీస్, జె. రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏ ఒక్క అర్హుడైన ఓటరు ఓటు హక్కు కోల్పోకూడదు

**- ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి విజయవంతం చేయాలి.**

**- 22(ఏ) భూముల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి.**

**- ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు: ఎమ్మెల్యే భూపతి రెడ్డి**



నిజామాబాద్ రూరల్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఏ ఒక్క అర్హుడైన ఓటరు ఓటు హక్కును కోల్పోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియతో పాటు 22(ఏ) భూములు, ఇతర రెవెన్యూ సమస్యలపై శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్డీవో రాజేందర్ నేతృత్వంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నిజామాబాద్ రూరల్, మోపాల్, డిచ్పల్లి, ధర్పల్లి, జక్రాన్పల్లి, సిరికొండ, ఇందల్వాయి మండలాల తహసీల్దార్లు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని ఎమ్మెల్యే సమీక్షించారు. అర్హులైన ప్రతి ఓటరుకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, నోటీసులు జారీ చేసిన సందర్భాల్లో అవి సంబంధిత వ్యక్తులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నోటీసులకు సంబంధించిన అభ్యంతరాలు, సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు.

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం ఎస్ఐఆర్ ప్రక్రియలో ముందంజలో ఉందని పేర్కొన్న ఎమ్మెల్యే, ఇదే స్ఫూర్తితో మిగిలిన ప్రక్రియను కూడా సమర్థవంతంగా పూర్తి చేయాలని అన్నారు. బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి పెండింగ్లో ఉన్న అంశాలను పరిష్కరించడంతో పాటు కొత్తగా అర్హత పొందిన ఓటర్లను నమోదు చేయాలని, డూప్లికేట్ ఓట్లను నిబంధనల ప్రకారం గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**22(ఏ) భూములపై ప్రత్యేక దృష్టి**

సమావేశంలో 22(ఏ) కింద ఉన్న భూముల అంశంపై కూడా విస్తృతంగా చర్చించారు. గ్రామాల వారీగా నిషేధిత జాబితాలో ఉన్న భూములు, వాటి సర్వే నంబర్లను సమీక్షించారు. అర్హులైన పట్టా భూములు అనవసరంగా 22(ఏ) జాబితాలో చేరకుండా అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజల నుంచి వచ్చే 22(ఏ)కు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. భూ సమస్యల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక, మొరం విషయంలో ఇబ్బందులు ఉండకూడదు.**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, మొరం విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిబంధనల ప్రకారం అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు వేగంగా స్పందించాలని అన్నారు.

సాదా బైనామాలకు సంబంధించిన విన్నపాలను కూడా నిబంధనల పరిధిలో పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని సూచించారు. చిన్నచిన్న రెవెన్యూ సమస్యల కోసం ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా అధికారులు వ్యవహరిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా చూస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

**స్థానిక రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఆదేశాలు.**

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలపై కూడా సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా తొర్లికొండ, బ్రాహ్మణపల్లి గ్రామాల్లోని సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి సంబంధించి తలెత్తుతున్న రెవెన్యూ సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించి అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని సూచించారు. ప్రజలకు సంబంధించిన రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అధికారులు మానవతా దృక్పథంతో, నిబంధనల పరిధిలో వేగంగా స్పందించాలని డా. ఆర్. భూపతి రెడ్డి కోరారు. ప్రజలకు పారదర్శకమైన, బాధ్యతాయుతమైన సేవలు అందించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# విద్యార్థులకు యూనిఫాం, షూల పంపిణీ

**- మెట్టు మర్రి తాండలో గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో కార్యక్రమం.**



నిజామాబాద్ రూరల్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): సిరికొండ మండలం మెట్టు మర్రి తాండ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో శనివారం యూనిఫాం, షూలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కేతావత్ తిరుపతి, ఉపసర్పంచ్ గోపియా నాయక్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ నిధులతో విద్యార్థులకు తెల్ల దుస్తులతో పాటు నలుపు-తెలుపు రంగుల షూలను అందజేశారు. అదేవిధంగా ప్రభుత్వం అందిస్తున్న విద్యార్థుల యూనిఫాంలను కూడా ఈ సందర్భంగా పంపిణీ చేశారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు అవసరమైన యూనిఫాం, షూలను అందించడం ద్వారా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని నాయకులు తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, తెలంగాణను విద్యారంగంలో దేశంలోనే ముందంజలో నిలపాలనే లక్ష్యంతో పలు కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, దుస్తులు, షూల పంపిణీ కార్యక్రమాలపై వారు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డికి గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకుడు సంతోష్ నాయక్, మాజీ సర్పంచ్ బాల్ సింగ్, మాజీ ఉపసర్పంచ్ అజ్మీర జగన్ నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరోజ, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రామ్జీ, డీసీసీ కమిటీ సభ్యుడు శంకర్, సంతోష్ పంతులు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గడ్కోల్లో 14 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు

**- పేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ ఆపన్నహస్తం.. సర్పంచ్ సండ్ర లత శంకర్.**



నిజామాబాద్ రూరల్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో శనివారం 14 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వేల్పూర్ గంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ సండ్ర లత శంకర్, ఉపసర్పంచ్ రొక్కం సంపత్ రెడ్డి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. లబ్ధిదారులైన న్నాజిపేట్ బోర్రన్నకు రూ.60 వేలు, దడిగా రవీందర్కు రూ.56 వేలు, నిమ్మ రాజుల సుధీర్కు రూ.32 వేలు, కాసుల దశరథ్కు రూ.34 వేలు, ఆకుల సాయన్నకు రూ.32 వేలు, ఎగ్గడి రాజన్నకు రూ.30 వేలు, నీరటి వేదాన్ష్కు రూ.24 వేలు, భీమనబోయిన నిత్యకు రూ.20 వేలు, సుద్దాపల్లి ఆదర్శనికి రూ.19,500, మెండే ప్రవీణ్కు రూ.19 వేలు, చేగంటి గంగాధర్కు రూ.14,500, అబ్దుల్ రుకియాకు రూ.13 వేలు, కే. దశరథ్కు రూ.11,500, డి. రవీందర్కు రూ.10 వేలు చొప్పున సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. మొత్తం రూ.3,75,500 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సండ్ర లత శంకర్ మాట్లాడుతూ., పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్య సమయంలో సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం ఎంతో అండగా నిలుస్తుందని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయంతో కొంతమేర భరోసా కలుగుతుందని పేర్కొన్నారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు, నాయకులు కృషి చేస్తారని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. తమ వైద్య ఖర్చులకు ఆర్థికంగా అండగా నిలిచిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డికి, డిసిసి ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి లకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. తమలాంటి పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందించడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తలారి హేమంత్, గంభీరావుపేట అఖిల్, కొమ్మేటి గంగాధర్, బుక్క గంగాధర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ గొల్ల లింబాద్రి, జానకంపేట భాస్కర్ రెడ్డి, కామారెడ్డి సంతోష్ రెడ్డి, వెల్మ భానుచందర్ రెడ్డి, లింగంపల్లి పోచయ్య, సుభాష్తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బలరామ జయంతి వేడుకలు

సదాశివనగర్, సెప్టెంబర్ 19(మనం న్యూస్): సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో బలరామ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు జెండాను ఆవిష్కరించారు. అనంతరం వ్యవసాయ రంగంలో విశేష సేవలు అందిస్తున్న ఉత్తమ రైతులతో పాటు, విద్యారంగంలో సేవలందిస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరాన్ని ప్రతినిధులు వివరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# సకాలంలో రక్తదానం చేసిన విట్టల్‌గౌడ్

**- రక్తదాతల సహకారంతోనే అత్యవసర వేళల్లో సేవలు ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు.**



కామారెడ్డి, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమని ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు అన్నారు. కామారెడ్డి ప్రభుత్వ వైద్యశాలలో ఆపరేషన్ నిమిత్తం బోయ నవనీతకు ఓ పాజిటివ్ రక్తం అవసరం కాగా, సింగరాయపల్లి గ్రామానికి చెందిన విట్టల్గౌడ్ స్పందించి సకాలంలో రక్తదానం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి అవసరమైన రక్తాన్ని అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని డాక్టర్ బాలు తెలిపారు. సకాలంలో రక్తం అందకపోతే ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. రక్తదానం చేసిన విట్టల్గౌడ్కు కృతజ్ఞతలు తెలిపారు.

# శివ సాయి గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు

**- భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమం.**

**- భారీగా తరలివచ్చిన భక్తులు.**





నిజామాబాద్ రూరల్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): మక్లూర్ మండలం మదన్పల్లి గ్రామంలోని శివ సాయి గణేష్ మండపం వద్ద శనివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం మండపం నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య ప్రశాంతంగా కొనసాగింది.

# ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీపై స్పష్టతనివ్వాలి

**ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి, పెండింగ్ నోటీసులను త్వరితగతిన అందజేయాలి.**

**రాష్ట్ర ఉపసర్పంచ్ల ఫోరమ్ ఉపాధ్యక్షులు విఖార్ పాషా.**



రెంజల్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): గ్రామ పరిధిలో ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీ ప్రక్రియపై రాష్ట్ర ఉపసర్పంచ్ల ఫోరమ్ ఉపాధ్యక్షులు, గ్రామ ఉపసర్పంచ్ విఖార్ పాషా అధికారులతో చర్చించారు. నోటీసుల పంపిణీ విషయంలో ప్రజలకు ఎలాంటి అపోహలు, ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన అవగాహన కల్పించాలని ఆయన కోరారు.

**నోటీసుల్లోని అంశాలను ప్రజలకు వివరించాలి**

ఎస్ఐఆర్ నోటీసుల్లో పొందుపరిచిన అంశాలు సామాన్య ప్రజలకు సైతం సులభంగా అర్థమయ్యే విధంగా వివరించాలని విఖార్ పాషా సూచించారు. నోటీసులు అందుకున్న ప్రతి ఒక్కరికీ వాటి ఉద్దేశ్యం, తదుపరి చేపట్టాల్సిన ప్రక్రియపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

**పెండింగ్ నోటీసులపై అధికారులను ప్రశ్నించిన విఖార్ పాషా.**

ఇప్పటివరకు ఇంకా ఎన్ని ఎస్ఐఆర్ నోటీసులు పెండింగ్లో ఉన్నాయి?, వాటి పంపిణీలో ఆలస్యానికి గల కారణాలేంటి?, మిగిలిన నోటీసులను ఎప్పటిలోగా ప్రజలకు అందజేస్తారు? అనే అంశాలపై ఆయన అధికారులను ప్రశ్నించారు. పెండింగ్లో ఉన్న నోటీసుల పంపిణీని ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని కోరారు.

**పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేయాలి.**

ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీ ప్రక్రియను త్వరితగతిన, పారదర్శకంగా పూర్తి చేయాలని విఖార్ పాషా అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు అవసరమైన సమాచారం అందించి, ఎలాంటి అయోమయానికి తావులేకుండా ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు.



## గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన సర్పంచ్ క్యాతం యోగేష్

**రోడ్లపై గుంతలను మొరంతో పూడ్చి, లైటింగ్ ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ**



రెంజల్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): గణేష్ నిమజ్జనం సందర్భంగా నీలా గ్రామంలో చేపట్టిన ఏర్పాట్లను గ్రామ సర్పంచ్ క్యాతం యోగేష్ పాలకవర్గ సభ్యులు, గణేష్ మండపాల నిర్వాహకులతో కలిసి పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమానికి వచ్చే భక్తులు, గణేష్ మండపాల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లను చేపట్టారు.

**రోడ్లపై గుంతలకు మరమ్మతులు.**

గ్రామంలోని నిమజ్జన మార్గాల్లో రోడ్లపై ఏర్పడిన గుంతలను మొరంతో పూడ్చి రోడ్లను సరిచేశారు. అలాగే రోడ్లపై పేరుకుపోయిన డస్ట్ను తొలగించి, నిమజ్జన మార్గాల్లో అవసరమైన చోట్ల లైటింగ్ ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో నిమజ్జన ఊరేగింపు సురక్షితంగా కొనసాగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

**భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు.**

గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగేలా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తి చేసినట్లు సర్పంచ్ క్యాతం యోగేష్ తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహకులు, గ్రామ ప్రజలు నిమజ్జన కార్యక్రమంలో సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# రోబోటిక్స్‌పై విద్యార్థులకు ప్రత్యేక వర్క్‌షాప్





**– తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 106 మంది విద్యార్థులు.**

నిజామాబాద్ రూరల్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు రోబోటిక్స్పై ఆసక్తిని పెంచే ఉద్దేశంతో సిరికొండ తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో శనివారం ప్రత్యేక వర్క్షాప్ నిర్వహించారు.

సోహం అకాడమీ ఆధ్వర్యంలో 8వ, 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఈ వర్క్షాప్లో మొత్తం 106 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోబోటిక్స్కు సంబంధించిన ప్రాథమిక అంశాలతో పాటు పలు ప్రాక్టికల్ కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల ప్రతిభ, ఆసక్తిని పరిగణనలోకి తీసుకుని 24 మంది విద్యార్థులను రోబోటిక్స్ క్లబ్కు ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి తెలిపారు. రోబోటిక్స్ క్లబ్ కెప్టెన్గా 9వ తరగతికి చెందిన ఆదిత్య, వైస్ కెప్టెన్గా 8వ తరగతికి చెందిన హర్షవర్ధన్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు రోబోటిక్స్ రంగంలోని సాంకేతిక అంశాలను ఆసక్తిగా తెలుసుకున్నారు. ప్రాక్టికల్ కార్యకలాపాల్లో ఉత్సాహంగా పాల్గొంటూ తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఇన్చార్జ్ సౌమిత్రి, లావణ్య, సోహం అకాడమీ టీమ్ హెడ్ వినయ్ రెడ్డితో పాటు అకాడమీ బృంద సభ్యులు పాల్గొన్నారు. విద్యార్థులకు సాంకేతిక విద్యను మరింత చేరువ చేస్తూ, వారిలోని ప్రతిభను వెలికితీసే విధంగా ప్రత్యేక వర్క్షాప్ నిర్వహించిన సోహం అకాడమీ యాజమాన్యానికి పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

# ధర్మారెడ్డిలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం





నాగిరెడ్డిపేట్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): నాగిరెడ్డిపేట్ మండలం ధర్మారెడ్డి గ్రామంలో స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం ఆవరణలను శుభ్రం చేశారు. పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జయరాజ్, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఉపాధ్యాయురాలు ప్రతిభ, అంగన్వాడీ సమన్వయకర్త వజ్రవ్వ, మహిళా సంఘం సభ్యులు, వార్డు సభ్యులు సాయిబాబా, లాలు తదితరులు పాల్గొన్నారు.

# పలు గ్రామాల్లో ఎమ్మెల్యే భూపతి రెడ్డి పరామర్శలు







### మృతుల కుటుంబాలను ఓదార్చి.. బాధితులకు మనోధైర్యం.

నిజామాబాద్ రూరల్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో పలు గ్రామాల్లో జరిగిన విషాద సంఘటనల నేపథ్యంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి శనివారం విస్తృతంగా పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ధర్పల్లి మండలంలో పరామర్శలు

ధర్పల్లి మండలం రామడుగు గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే భూపతి రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కీ.శే. కల్లెడ చిన్న గంగాధర్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం పార్టీ నాయకుడు అజయ్ ఇటీవల మాతృవియోగానికి గురికావడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అదే గ్రామానికి చెందిన ఎస్ఐ విజయ్ ఇటీవల పితృవియోగానికి గురికావడంతో ఆయన నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

### డిచ్పల్లి మండలంలో పరామర్శలు.

డిచ్పల్లి మండలం కమలాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ కీ.శే. యానంపల్లి రాజన్న కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. రాజన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అనంతరం మెంట్రాజ్పల్లి గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే, స్థానిక సర్పంచ్ ప్రవళిక-వినోద్ కుటుంబంలో ఇటీవల జరిగిన మాతృవియోగంపై కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఉప సర్పంచ్ సురేష్ తండ్రిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గ్రామానికి చెందిన గుర్రపు కిషన్ కుటుంబాన్ని కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ధర్మారం(బి)లోనూ బాధిత కుటుంబాలకు పరామర్శ

అనంతరం ధర్మారం(బి) గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే భూపతి రెడ్డి, గ్రామానికి చెందిన రావుల బ్రహ్మానందం కుటుంబాన్ని పరామర్శించారు. ఇటీవల ఆయన తల్లి మృతి చెందడంతో కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదే గ్రామానికి చెందిన కొనగం సుబ్బారావు తల్లి ఇటీవల మృతి



చెందడంతో ఆయన కుటుంబాన్ని కూడా ఎమ్మెల్యే పరామర్శించి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ., కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఆయా కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని భరోసా కల్పించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ సాయిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబర్ సింగ్, సర్పంచ్ ఫోరం రూరల్ నియోజకవర్గ అధ్యక్షుడు వాసు, నాయకులు పొలసాని శ్రీనివాస్, అమృతాపూర్ గంగాధర్, రాంచందర్ గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ చేనేత సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులకు అభినందనలు



ఆర్మూర్, సెప్టెంబర్ 19(మనం న్యూస్ ): ఆర్మూర్ చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి సంఘం నూతన అధ్యక్షుడిగా చెన్న రవికుమార్, ఉపాధ్యక్షుడిగా బెంకి గంగామోహన్, బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆర్మూర్ మండల గౌడ సంఘం అధ్యక్షుడు మందాపురం దశ గౌడ్, 6వ వార్డు కౌన్సిలర్, కోటర్మూర్ వీడీసీ మాజీ అధ్యక్షుడు శేర్ల గంగాధర్ గౌడ్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా చెన్న రవికుమార్, బెంకి గంగామోహన్లు దశ గౌడ్, గంగాధర్ గౌడ్లను ఆర్మూర్లో తయారైన చేనేత శాలువాలతో ఘనంగా సన్మానించారు. చేనేత కార్మికులకు నిరంతరం పని కల్పిస్తూ, ప్రభుత్వ పథకాలు నేతన్నలకు అందేలా కృషి చేసి, ఉత్పత్తిని పెంచి సహకార సంఘాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్లాలని వారు ఆకాంక్షించారు.

## మున్సిపల్ అనుమతి లేకుండా నిర్మాణం చేపడితే చర్యలు తప్పవు

### – మున్సిపల్ కమీషనర్ డి. గజానంద్




భీమ్గల్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్):ంగల్ పట్టణ పురపాలక సంఘం పరిధిలో నూతన గృహాలు, మడిగెలు, కమర్షియల్ షట్టర్లు నిర్మించాలనుకునే వారు తప్పనిసరిగా మున్సిపల్ అనుమతి పొందిన తర్వాతే నిర్మాణ పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ డి. గజానంద్ సూచించారు. మున్సిపల్ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే నోటీసులు జారీ చేయడంతో పాటు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పురపాలక సంఘం పరిధిలో నూతన నిర్మాణాలు చేపట్టాలనుకునే వారు ముందుగా ఆన్లైన్ విధానంలో మున్సిపల్ బిల్డింగ్ పర్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సంబంధిత అధికారులు పరిశీలించి అనుమతి మంజూరు చేసిన అనంతరం, మంజూరైన అనుమతులకు లోబడి మాత్రమే నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టినట్లయితే సంబంధిత నిర్మాణదారులకు నోటీసులు జారీ చేయడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో ఎన్ఫోర్స్మెంట్ టీం ద్వారా అనధికార నిర్మాణాలను తొలగించే చర్యలు చేపట్టే అవకాశం ఉందని కమిషనర్ తెలిపారు. అనుమతులు పొందకుండా నిర్మాణాలు ప్రారంభించి తర్వాత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి రాకుండా, కొత్త ఇళ్లు, మడిగెలు, కమర్షియల్ షట్టర్లు నిర్మించాలనుకునే వారు ముందుగానే మున్సిపల్ అధికారులను సంప్రదించి అవసరమైన అనుమతులు పొందాలని డి.గజానంద్ కోరారు.